# 17

# ప్రకృతి

దట్టమైన అడవి.

మంద్ర స్థాయి షహనాయి నాదంలా, గాలి మెల్లిగా బరువుగా సాగుతూవుంది.

సెలయేటి నీళ్ళు, జలతరంగ్ వాయిస్తూ పరుగులు పెడు తున్నాయి.

ఆదిమానవుడు ఒంటరిగా ఉన్నాడు. చుట్టూ ఉన్న ఆకుపచ్చని క్లోరోఫిల్‌తో పులకించి పోతున్నాడు.

"ప్రకృతీ! ప్రకృతీ! !

నీ కోసం నేనెంత తల్లడిల్లి పొయ్యాను ప్రకృతీ!

నిన్నెంత అన్వేషించాను

నిన్నెంత ఆనందించాను

నీలో భాగమై నీలో రాగమై కలిసి పొయ్యాను

చెట్టూ పుట్టా గుట్టా అన్నీ తిరిగాను

జీవ కోటిలో నేనూ ఒకడినై

నిన్ను ఆరాధిస్తూ వచ్చాను"-

అంటూ-

తనలో తాను లీనమై, తన్మయత్వంలో పాడుకుంటున్న ఆది మానవుడిని ఎవరో పిలిచారు. తపస్సు భంగమైనట్లుగా అతడు అయిష్టంగా పక్కకు చూశాడు.

తనలాంటి వ్యక్తే మరొకతను నిలబడి ఉన్నాడు. పోలికలూ ఉన్నాయి. అయితే భేదాలూ ఉన్నాయి. అతను ప్రేమగా నవ్వాడు. స్నేహపూరితంగా మాట్లాడాడు.

"నమస్తే బ్రదర్! నన్ను గుర్తుపట్టారా? నేను మీవాణ్ణే. మీ సంతతి వాణ్ణే. ఆధునిక మానవుణ్ణి."

"ఆధునిక మానవుడా?" ఆశ్చర్యంగా చూశాడు ఆదిమానవుడు. ఎదుటివ్యక్తి అబద్ధం చెబుతున్నట్లుగా అనిపించిందతనికి. "నా కాలంలో నేనూ ఆధునిక మానవుణ్ణనే అనుకున్నాను. నా ముందు తరాల వాళ్ళు జంతువుల్లా ప్రవర్తించే వాళ్ళు. నేను- నా విలువను తెలుసుకుని, నా శక్తి సామర్థ్యాల్ని గ్రహించి, ప్రకృతిని ఆరాధిస్తూనే అర్థం చేసుకుంటూనే దాన్ని ఎదిరించాను. కాబట్టి నేను ఆధునిక మానవుణ్ణే కదా?"

ఆధునికుడు తన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ- తెలివి ఉట్టిపడేలా నవ్వాడు. ఆదిమానవుడికి అతని స్థానం ఏదో గుర్తుచేయక తప్పదు అని కూడా అనుకున్నాడు.

"కాదు. మీతరువాత మీ రూహించలేనంత ప్రగతి సాధించాం. ఇప్పటి ప్రమాణాల ప్రకారం మీరు ఆది మానవుడు! నేను ఆధునిక మానవుణ్ణి! మనిషి ప్రకృతి ఆధీనంలో ఉన్నంత కాలం జంతువే. ప్రకృతిని అదుపులో పెట్టుకోగానే- ప్రకృతి సంపదను ఇష్టం వచ్చిన రీతిగా అనుభవించడం మొదలు పెట్టగానే మానవుడయ్యాడు. అందుకే మీరు ఆదిమానవులు. మాకు గౌరవనీయులు. కాని, మీకు సరైన భాషలేదు. నాగరికత లేదు- కొండ గుహల్లో తలదాచుకుంటూ- రాళ్ళ మీద బొమ్మలు గీసుకుంటూ గడిపారు. మచ్చిక చేసుకున్న జంతువుల్ని మేపుకుంటూ తిరిగారు."

"ఆపు!" అని పెద్దగా అరిచాడు ఆదిమానవుడు. అతడికి ఉక్రోషం ఆగింది కాదు. 'గౌరవనీయులు' అంటూనే ఎదుటి వాడు

ఎత్తిపొడుస్తున్నాడు. నాగరికత లేదంటాడే వీడూ? అసలు దానికి పునాదులు వేసిందే మేం! ఈ కుర్ర కుంకకు ఎవడు చెప్పాలి?

ఆది మానవుడికి మండి పోయింది.

"ఒరేయ్! అంత తక్కువగా అంచనా వేయకురా మమ్మల్ని! ఈ ప్రకృతిలో గాలి, నీరు, అగ్ని ఉన్నాయని తెలుసుకున్నది ఎవరనుకున్నావ్! మేం కాదూ? చూడూ! అంత విలాసంగా ఖరీదైన సిగరెట్ కాల్చుకుంటున్నావే. మరి, మొట్ట మొదట అగ్నిని కనిపెట్టి అదుపులోకి తెచ్చిందెవరు? ఇవ్వాళ నువ్వు మలేషియా, సింగపూర్, హాంకాంగ్- దేశ దేశాలన్నీ స్టీమర్ల మీద తిరిగొస్తున్నావే. అసలు మొదట నీటిని దుంగలతో దాటొచ్చని తెలుసుకున్నది ఎవరు? ఈనాడు మహా మహా నగరాలు నిర్మితమై ఉండవచ్చు. కాదనను. స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవాలన్న జ్ఞానం, భూమిని దున్ని కావలసిన పంట పండించుకోవచ్చునన్న ఆనాటి విజ్ఞానం తక్కువదేమీ కాదు."

ఆధునికుడు సిగరెట్ పొగ వదిలి, స్టైల్‌గా బూడిద రాల్చి, కళ్ళుమూసుకుని, తలవంచి చేతులు జోడించాడు. అంతా నాకు తెలిసిందే స్వామీ. నీ డబ్బా నువ్వు ఎందుకు కొట్టుకొంటావ్ అనే కించిత్తు హేళన ఉంది ఆ నమస్కార బాణంలో.

"అయ్యా! ఆదిమానవుడు గారూ! క్షమించాలి. నేను మిమ్మల్ని తక్కువగా అంచనా వేయడం లేదు. అసలు 'ఆది'- అని అనడంలోనే అంతా ఉంది సార్! ఆది అంటే మొదలు అని కదా అర్థం? ఓసారి మిమ్మల్ని మీరు చూసుకోండి. చలి పెట్టకుండా జంతువుల చర్మాల్ని కప్పుకొచ్చారు. స్వయం రక్షణార్థం సాన పెట్టిన బండరాయిని పట్టుకొచ్చారు. చేతిలో పచ్చి మాంసం- జుట్టు పిచ్చిగా పెరిగింది. షేవ్ చేసుకోలేదు. అజ్ఞాన శిఖామణీ! అనాగరిక చక్రవర్తీ! !"

"ఏ.... ఏ.... ఏయ్.... లబ ఛిపా ఖపా- ఎహేయ్?'- ఆది మానవుడు ఉరుములా అరిచాడు. ఆధునికుడు జడుసుకున్నాడు. భయంకరంగా అరిచి, మాంసం ముక్క నేలకేసి కొట్టి, ఒక్కొక్క అడుగూ ముందుకేసి, ఆది మానవుడు ఆధునికుడి పైకి వచ్చాడు. ఆధునికుడి పై ప్రాణాలు పైనే పొయ్యాయ్. గొంతెండిపోయింది. "హెల్ప్, హెల్ప్" అని- అరుద్దామనుకున్నాడు. చుట్టూ జంతువులు తప్ప, మనుషుల జాడ లేదాయె.... ఏం చెయ్యడం?!

''జాగ్రత్తగా మాట్లాడరా డింభకా! నాకు తిట్లు గొప్పవైనా.... చప్పవైనా అర్థమవుతాయి. కుర్రకుంకా- నువ్వేంట్రా నన్ననేది? నేను జంతువుల చర్మాలు కప్పుకుంటే- నువ్వు వాటి నుంచి ఉన్ని తీసి ఆ కవచాలు కుట్టించుకున్నావ్. అంతేగా?"

ఆ ప్రశ్నకు వెంటనే సమాధానం చెబుదామనుకున్నాడు ఆధునికుడు. కానీ భయంతో నోరు పెగిలింది కాదు. "అయ్యా! అట్లా అరవకండి. నాకేదో భయంగా ఉంది.... మరి, మరి ఇవి కవచాలు కావు మహా ప్రభో.... ఉలెన్ సూటు. అది సరే, పచ్చిమాంసం పీక్కు తినే ఆ కెనైన్ దంతాలు కాస్త లోపలికి ఉండనివ్వండి. నా గుండె కొట్టుకోవడం తగ్గిపోతున్నట్లుంది. ఇక అంతదాకా వస్తే- ఇదిగో నా పిస్టల్ ఉపయోగించాల్సి వస్తుంది. దీని సంగతి మీకు తెలియదు. కదలకుండా నిలుచుని ఎంత మందినైనా నిలువునా కాల్చేయొచ్చు..."

ఆది మానవుడు వికటంగా తన ఆటవిక హాసాన్ని నలువైపులా మారుమ్రోగేట్లు ప్రదర్శించాడు. నవ్వి, శాంతించాడు. శాంతించి, ప్రేమగా చూశాడు. చూసి, వాత్సల్య పూర్వకంగా అన్నాడు. "ఒరే, ఆధునిక నరమానవుడా, భయపడకు! మీ ప్రగతి మనుషులు మనుషుల్ని చంపుకోవడం వరకు వచ్చిందేమోగాని, మాకంత నాగరికత లేదు. నేను నిన్నేం చెయ్యను. నా ఆకారమే అంత. నా నవ్వు తీరు, మాట తీరే అంత. భయపడకు" అని అన్నాడు.

ఆధునికుడు దాంతో కాస్త కుదురుకున్నాడు. అది గమనించి ఆది మానవుడు మళ్ళీ పెద్ద మనిషి తరహాలో చెప్పడం మొదలు పెట్టాడు.

"తమ్ముడా! ఆధునికుడా! నేనైనా, నువ్వైనా ప్రకృతి సంపదను కొల్లగొట్టిన వాళ్ళమే! నీకు నువ్వై సృష్టించిందేమీ లేదు. నేను ముడి సరుకును ముడి సరుకుగానే వాడాను. నువ్వు వాటికి మెరుగులు పెట్టావు అంతే!.... జంతువును చూడు. అది మరొక జంతువును చంపాలంటే ప్రకృతి ప్రసాదించిన కళ్ళు, కాళ్ళు, పళ్ళు, గోళ్లు ఉపయోగిస్తుంది. మేము అలా కాదు. ప్రకృతిని అదుపులోకి తెచ్చుకుని, బాహ్య ప్రపంచం నుండి ఆయుధాలు తయారు చేసుకుని జంతువుల్ని వేటాడాం. ఈ మేధా శక్తివల్లే మాకు ప్రకృతి మీద కొంత కొత్త అధికారం సంక్రమించింది."

ఆది మానవుడి ధోరణిలో కొంత మార్పు కనబడగానే, ఆధునికుడు ఇక ఫరవాలేదనుకున్నాడు. తన అభిప్రాయాలు కూడా నిర్భయంగా చెప్పవచ్చుననుకున్నాడు. పైగా ఆది మానవుడు చెప్పిన విషయాలు కొన్ని, ఒప్పుకోక తప్పదు. అందుకే ఒప్పేసుకున్నాడు కూడా!

"అవును.... మీరు చెప్పిన విషయం ఎంతో సున్నితమైంది. సూక్ష్మమైంది. పైగా విలువైంది. చూశారా! ప్రకృతిలో ప్రతి జీవి పరిసరాలకు తగినట్టుగా మారేదే. కానీ, ప్రకృతిని మార్చడం వల్ల, మన గొప్పతనం బయటపడింది. ఇదే లక్షణం జంతువులతో మానవుణ్ణి వేరు చేస్తుంది. ముందు జత కాళ్ళను చేతులుగా మార్చుకుని, క్రమంగా ఎదిగే మెదడు వల్ల లభ్యమైన మేధా శక్తితో క్రమ క్రమంగా ప్రకృతి లోని వివిధ శక్తులను, నిధులను అదుపులోకి తెచ్చుకున్నాడు. నిన్నా ఇవ్వాళా జరిగిన ప్రయాత్నమా? కాదు- లక్షల లక్షల సంవత్సరాల సంఘర్షణ! అన్వేషణ!! కృషి!!! ఈ ప్రకృతిలో తెలివైన వాడూ, మనిషే...."

రాళ్ళు రెండూ ఘర్షిస్తున్న శబ్దం వినపడి ఆధునికుడు మళ్ళీ బెదిరిపొయ్యాడు. నిప్పు రవ్వ ఒకటి ఎగిరొచ్చి, చెయ్యి చురుక్కు-మంది. ఏమిటని పరిశీలనగా చూస్తే- ఆది మానవుడు గారు రాళ్ళు రెండూ రెండు చేతుల్లో పట్టుకుని, అభినందన పూర్వకంగా చప్పట్లు చరుస్తున్నారు.

"బావుందయ్యా! బావుంది. ఆధునికుడవు. బాగా చదువుకున్న వాడివి. అందుకే చక్కగా నిర్వచించి చెప్పావు" అన్నాడు ఆది మానవుడు.

ఇంతలో వీణానాదం లాంటి ఒక స్త్రీ గొంతు వినిపించింది. ఎక్కడిదా మధుర స్వరం అన్నట్లు ఇద్దరూ ఆశ్చర్యపోయి చుట్టూ కలయ చూశారు.

"ఒకరి నొకరు పొగడుకుంటూ అన్నదమ్ములు తెగ సంతోషిస్తున్నారే!" అంది స్త్రీ గొంతు.

"ఎవరీ అశరీర వాణి?" అన్నాడు ఆది మానవుడు. "అశరీర వాణి కాదు. బహుశా ఆకాశవాణి! రేడియో వాళ్ళదో, టి.వి. వాళ్ళదో- వాయు తరంగం, వాళ్ళ ప్రోగ్రామ్‌కు సంబంధించింది" అన్నాడు ఆధునికుడు.

"ఒకరిది అజ్ఞానం, మరొకరిది అతి తెలివి!"

అంటూ స్త్రీ కంఠం గల గలా నవ్వింది. గుబురు చెట్ల మధ్య నుంచి వెలుగులా ముందుకొచ్చింది ఓ స్త్రీ. ఇద్దరూ ఆశ్చర్య పొయ్యారు. ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఆమె అతి నాజూకుగా ఉంది. అయితే అనుభవం పండిన తల్లిలా కూడా ఉంది.

"అయితే ఎవరు నువ్వు?" అనుకోకుండానే మానవులిద్దరూ ఒకేసారి అన్నారు.

"నేనే ప్రకృతిని!!"

మానవుల ముఖాలు వెలిగిపోయ్యాయి. అయితే ఆ వెలుగు వారి ముఖాలలో ఎంతో సేపు నిలువ లేదు. ఆమె వెంటనే మరో మాట కూడా అంది.

"లక్షల- కోట్ల సంవత్సరాలు మీ చర్యల్ని భరిస్తూ నాశన మౌతున్న వికృతిని!"

ఆ మాటకు ఆది మానవుడు తల్లడిల్లాడు.

"అమ్మా! ఎంత మాట తల్లీ! నీ ఒడిలో ఆడుకున్నామే తప్ప- నిన్ను నాశం చెయ్యలేదు తల్లీ!"

"మానవులారా! మీకు నేనేం తక్కువ చేశాను? గాలి, నీరు, ఆహారమిచ్చాను. అగ్ని నిచ్చాను. ఖనిజాలు, లవణాలు, లోహాలు ఇచ్చాను. అందమైన పక్షుల్ని, విచిత్రమైన జంతుజాలాన్ని సమ కూర్చాను. వర్షాన్నిచ్చాను. పండ్లు పంటలు పండించాను."

ప్రకృతి, పురాణాల్లోని దేవతలా మాట్లాడుతూ ఉండడం ఆధునికుడికి నచ్చలేదు. వ్యంగ్యంగా తిప్పి కొట్టాడు.

"ఇచ్చావ్. ఇచ్చావ్. అన్నీ ఇచ్చావ్. అతి వృష్టి అనావృష్టి కరువులు, కాటకాలు....!"

అసలే తల్లడిల్లుతున్న ఆది మానవుడు ఆధునికుడి ధోరణికి మరింత నొచ్చుకున్నాడు. వెంటనే జోక్యం చేసుకుని-

"సోదరా! తొందరపడకు. ఆ తల్లిని దూషించకు. అటవీ సంపదనంతా నాశనం చేసి, పరిశ్రమల పేరుతో వాతావరణాన్ని కలుషితం చేసి, మారణాయుధాల్ని, విష పదార్థాల్ని ఉత్పత్తి చేసు కుంటూ - ప్రకృతి మాత మనుగడకు ముప్పు తెస్తున్నది. ఎవరు? నువ్వే?

ప్రకృతిని అదుపులోకి తెచ్చుకున్నానన్న అహంభావం పక్కన పెట్టి, ఇప్పుడిక నిన్ను నువ్వు సరిగా అర్థం చేసుకో. అద్వితీయమైన

మేధా సంపత్తి గలవాడివి. నిన్ను నువ్వే రక్షించుకోవాలి. తప్పదు!" అన్నాడు ఆది మానవుడు.

ప్రకృతి ఆది మానవుడి వైపు వాత్సల్యంతో చూసింది. "పెద్ద వాడికి చదువురాలేదుగానీ, వాడి మనసెంతో మంచిదమ్మా'' అని- చెప్పుకునే సగటు తల్లిలా చూసింది ప్రకృతి. పెద్ద కొడుకును వెనకేసు కొస్తూ - చిన్న వాణ్ణి కదిలించింది.

"ఆధునికుడా ! నా బాధంతా నీ గురించేనయ్యా! అటు అంత రిక్షంలో గ్రహాల్ని నిలువనీయడం లేదు. ఇటు భూగర్భంలోని నిలు వలను నెగలనీయడం లేదు. భూమ్మీదా నువ్వే. ఆకాశం మీద నువ్వే. సముద్రమంతా నువ్వే. కనీసం మంచు ఖండాన్నైనా కదిలించకుండా ఉండలేదు. అక్కడా నీశోధనలే! నువ్వెక్కడా నన్ను నన్నుగా బతకనిచ్చేట్లు లేవు. నన్ను పరిరక్షించుకోకపోతే నీకు ప్రగతి లేదు. నా నాశనంలోనే నీ వినాశనం కూడా ఉంది. జాగ్రత్త!''

ప్రకృతి ఇంత ఘాటుగా హెచ్చరిస్తుందనుకోలేదు ఆధునికుడు. కానీ, ఆమె మాట అసత్యం కాదు. కాదనడానికీ లేదు. ఆధునికుడు ఆలోచించాడు. తప్పు తప్పే. తప్పు ఒప్పుకోవడంలో ఔన్నత్యం ఉంది. అనుకున్నాడు. చేతులు జోడించాడు.

"అమ్మా! ప్రకృతీ.... నన్ను క్షమించు!

"అన్నా ఆది మానవుడా- నా తప్పిదాలు మన్నించు!

"నాక్కొంచెం అహంభావం ఎక్కువ. మేధా సంపత్తి పెరగ గానే నాకు ఎదురే లేదనుకున్నాను. కానీ ఆలోచిస్తే నాది నాకు తెలిసొస్తుంది. ప్రకృతిలో నేను శోధించింది అణు మాత్రమే. ఇంకా ఎంతో ఉంది నా ఊహకూ, మేధకూ అందనిది. నేను సంపాదించిన విజ్ఞానం ఒక్కోసారి నాకే బెడిసి కొడుతోంది. నిజమే-విషపూరితమైన రసాయనాలు, మారణాయుధాలు తయారు చేసుకుని అణు యుద్ధానికి సైతం సిద్ధమవుతున్నాను. ప్రకృతిని చిత్రహింసలు పెట్టి బీభత్సం

చేస్తున్నాను. భూమి చుట్టూ ఉన్న స్ట్రాటో (STRATO) ఆవరణం లోని ఓజోన్ ($O_3$) పొరను కావల్సిన చోట తగ్గించి, శత్రుదేశాల వాతావరణంలో హానికరమైన మార్పులు చేయడానికి కూడా వెను కాడడం లేదు"

ఆధునికుడు తన తప్పిదాల్ని తాను తెలుసుకోవడం ప్రకృతికి సంతోషాన్ని కలిగించింది. అందుకే ఆ విషయమే నొక్కి చెబుతూ అంది.

"చూశావా! నాకై నేను చెప్పుకోనవసరంలేదు. నిన్ను నీవే ప్రశ్నించుకో. ప్రకృతిని బీభత్సం చేసి- మానవ జీవితాలు భయానకం చేసుకుంటున్నది- నువ్వే! ఆధునిక మానవుడా! అహంభావంతో పాటు నీకు ఆత్మస్థైర్యంకూడా ఎక్కువే. ఆలోచన, ఉద్రేకం అన్నీ ఎక్కువే. సమయానికి నేను వర్షాన్ని కురిపించకపోతే కృత్రిమ వర్షం కురిపించడానికి ప్రయత్నిస్తున్నావే గాని, ప్రకృతిని సహజ సిద్ధంగా ఉండనిస్తే-సహజసిద్ధమైన ఋతుపవనాల్ని వీచనిస్తే-సహజసిద్ధమైన వర్షాన్ని అనుభవించవచ్చు కదా! డీజిలు, పెట్రోలు, బొగ్గు వంటి ఇంధనాలకు బదులు సూర్యశక్తి గురుత్వాకర్షణశక్తి జలశక్తి విశ్వాంతర్గతశక్తి ప్రకృతి నుండి విస్తృత పరిమాణాల్లో సేకరించుకో. పారిశ్రామికీకరణలోనూ, ఎరువులలోనూ, ఆరోగ్యవంతమైన విధానాలు ప్రవేశపెట్టుకో. పరిసరాల్ని ఆరోగ్యవంతంగా ఉంచుకుంటే నీకే కాదు, నీ తరువాతి తరాల వారికి కూడా మేలు జరుగుతుంది."

ప్రకృతి మాత తనకు ఆత్మ స్థైర్యం ఎక్కువ అని కాంప్లిమెంట్ ఇచ్చినందుకు ఆధునికుడు లోలోన సంతోషించాడు. కృతజ్ఞతలు తెలియజేస్తూ అన్నాడు.

"అమ్మా! ప్రకృతీ! నీ సూచనలకు కృతజ్ఞుణ్ణి. ఇకపై నిన్ను పరిరక్షించుకుంటూనే పరిశోధనలు కొనసాగిస్తాను. ఇంకా పురోగ

మిస్తాను. ఇంతకూ.... మా బిగ్ బ్రదర్ ఆది మానవుడు గారేరీ?"- అంటూ దిక్కులు చూశాడు.

ప్రకృతి మాత పెద్దగా నవ్వింది.

"పిచ్చివాడా, పిచ్చివాడా! లక్షల సంవత్సరాల క్రితం నశించి పోయిన ఆది మానవుడు వచ్చి నీతో మాట్లాడాడని అనుకుంటున్నావా? అతడి రక్తం నీలో ఉంది చూడూ! అదే నీతో మాట్లాడింది. అంటే- నీతో నువ్వే మాట్లాడుకుంటున్నావన్నమాట!"

ప్రకృతి పచ్చగా, ఆహ్లాదంగా, కొత్త విశ్వాసాన్ని కలిగిస్తున్నట్లుగా అంది.

ఆధునికుడికి మరో అనుమానం కలిగింది. ఆ మాటే అడిగాడు.

"మరి నువ్వో.... నువ్వూ అబద్ధమేనా? అభూత కల్పనవేనా?" అన్నాడు.

"అబద్ధమూ కాదు. అభూత కల్పనా కాదు"- అంది ప్రకృతి. చివరగా మరో విషయం కూడా స్పష్టం చేసింది.

"నేను ప్రకృతిని! నీలో ఒక భాగాన్ని. నేను నీకొక వరమని ఎలాగైతే అనుకుంటున్నావో, నాకూ అంతే. నాకు నువ్వొక వరానివి! నా సంరక్షకుడివి నువ్వేనయ్యా- మానవుడా!"

ఆధునికుడు ఆనందంతో గంతులేశాడు, త్రిపాత్రాభినయం చేస్తున్నట్లు ఓ క్షణం అనుభూతి చెందాడు. తన 'ప్రకృతి'ని తాను సంరక్షించుకోవాలని అనుకున్నాడు. ○

ఆంధ్రప్రభ వారపత్రిక
దీపావళి ప్రత్యేక సంచిక
30 అక్టోబర్ 1991